ప్రజాశక్తి
గురువారం 20 ఏప్రిల్ 2023
5
విజయనగరం

గోదాముల నిర్మాణ పనుల్లో ప్రగతి సాధించాలి

ప్రజాశక్తి-విజయనగరం

పంట ఉత్పత్తులను తాత్కాలికంగా నిల్వ చేసుకొని సరైన ధర వచ్చినప్పుడు విక్రయించుకునే విధంగా రైతుల సౌకర్యార్థం స్థానిక ఆర్‌బికెలకు అనుసంధానంగా నిర్మిస్తున్న గోదాముల పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ నాగలక్ష్మి. ఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, జిల్లా సహకార అధికారి, సెంట్రల్ బ్యాంక్ జిల్లా మేనేజర్, మార్కెటింగ్ శాఖ, వ్యవసాయ శాఖ, ఇంజినీరింగ్ విభాగాల అధికారులతో ఆమె బుధవారం తన ఛాంబర్లో సమీక్షా సమావేశం నిర్వహించారు. గోదాములను వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. రుణాల మంజూరు, బిల్లుల ప్రక్రియ ఇతర ఆర్థిక వ్యవహారాలను సజావుగా నిర్వహించాలని సూచించారు. మూడు విడతల్లో జిల్లాకు సుమారు 245 గోదాముల మంజూరు అయ్యాయని జిల్లా సహకార అధికారి కమిటీకి వివరించారు. సరైన పర్యవేక్షణ వహించి పనులను సజావుగా నిర్వహించి ఉత్తమ ఫలితాలు సాధించాలని పేర్కొన్నారు.

చింతపల్లిలో జెట్టీకి గ్రీన్ సిగ్నల్

జెట్టీ నిర్మించనున్న చింతపల్లి తీరం ఇదే..

ఆరు ఎకరాలు కేటాయింపు

3న సిఎం శంకుస్థాపన

మత్స్యకారులకు ఊరట

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

సుదీర్ఘకాలంగా పెండింగ్‌లోవున్న చింతపల్లిలో ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మే 3వ తేదీన జెట్టీ నిర్మాణానికి సిఎం జగన్మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు జిల్లాకు చెందిన విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ కూడా బుధవారం ప్రకటన చేశారు. జెట్టీ నిర్మాణంలో భాగంగా మిగిలిన సదుపాయాలు కల్పించేందుకు సుమారు6ఎకరాలు కేటాయించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం. జిల్లాలోని భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో 19 మత్స్యకార గ్రామాలున్నాయి. ఈ గ్రామాలకు చెందిన సుమారు 10వేల కుటుంబాలు సముద్రంలోని వేటపై ఆధారపడి జీవిస్తున్నాయి. వేటాడిన చేపలను భద్రపర్చేందుకు కోల్డ్ స్టోరేజీలంటూ లేవు. ప్రభుత్వం తరపున మార్కెట్ సదుపాయం కూడా లేదు. దీంతో, ఎంతో కష్టపడి వేటాడిన చేపలను దళారులకు కారుచౌకగా కట్టబెట్టాల్సి వస్తోంది. దీనికితోడు చేపల వేట అనంతరం ఒడ్డుకు చేర్చిన బోట్లు నిలుపుకోవడానికి సరైన సదుపాయం లేదు. జెట్టీ లేకపోవడంతో సముద్రంలోనే లంగరు వేయాల్సిన పరిస్థితి నెలకొంటోంది. తుపాను సమయాల్లో అలల తాకిడికి బోట్లు గల్లంతవుతున్నాయి. దీంతో, మత్స్యకారులు రూ.లక్షలు నష్టపోవాల్సి దుస్థితి సుదీర్ఘకాలంగా కొనసాగుతోంది. ఈ కష్టనష్టాలు భరించలేక స్థానిక మత్స్యకారులు గుజరాత్‌లోని హీరావి, ఒడిశాలోని పారాదీప్, కేరళ కొచ్చిన్ తదతర ప్రాంతాలకు వలసపోతూ కూలీలుగా మారుతున్నారు. ఈనేపథ్యంలో స్థానికంగా జెట్టీ ఏర్పాటు చేయాలనే డిమాండ్ చేలా కాలంగా ఉంది. గతంలో టిడిపి ప్రభుత్వమే దీన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించింది.

ఎట్టకేలకు వైసిపి ప్రభుత్వం స్పందించి రూ.25కోట్లతో ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణానికి ముందుకొచ్చింది. ఇది నిరంతరం సముద్రపు ఆటుపోట్లు వచ్చే ప్రాతంలో కాకుండా నీరు స్థిరంగా ఉండే ప్రాంతంలోనే ఏర్పాటుకు అనువుగా ఉంటుంది. వేటాడిన మత్స్య సంపదను బోటుల నుంచి ఒడ్డుకు చేర్చడానికి, బోటులు లంగరు వేయడానికి మాత్రమే తోడ్పడుతుందని సమాచారం. ఇది పూర్తయితే మత్య్సకారుల సమస్య పరిష్కారం కావడంతోపాటు వారి ఆర్థికంగా అభివృద్ధి చెంది, జీవనం మెరుగుపడుతుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఎయిర్‌పోర్టు శంకుస్థాపనకు ఏర్పాట్లు

విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరం

మేనెల 3వ తేదీన భోగాపురం ఎయిర్‌పోర్టుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారని, అందుకు అవసరమగు ఏర్పాట్లను వెంటనే చేపట్టాలని రాష్ట్ర విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ అధికారులకు ఆదేశించారు. కలెక్టర్ ఛాంబర్ లో బుధవారం మంత్రి బొత్స పరిశ్రమలు, మౌలిక వసతుల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలెవన్, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు , ఎంపి బెల్లాన చంద్ర శేఖర్, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్.పి దీపికా పాటిల్ తో కలసి ఏర్పాట్ల పై సమీక్షించారు. ఎయిర్‌పోర్టుతో పాటు చింతపల్లి వద్ద ఫ్లోటింగ్ జట్టీకి కూడా శంకు స్థాపన చేస్తారని తెలిపారు. శంకుస్థాపన అనంతరం బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడతారని, అందుకు అనువైన వేదికను రెండు రోజుల్లో గుర్తించాలని జిల్లా పరిషత్ చైర్మన్‌కు, ఎమ్మెల్యేకు సూచించారు. శంకుస్థాపనకు అవసరమగు శిలాఫలకం ఏర్పాటుకు, వాహనాల పార్కింగ్ కు అనువైన స్థలాన్ని గుర్తించి ఏర్పాట్లను గావించాలన్నారు. వివిపిల వాహనాలకు , అధికారులకు, సాధారణ ప్రజలకు బహిరంగ సమావేశానికి వేర్వేరు రూట్లు ఉండే స్థలాన్ని గుర్తించాలన్నారు. వాహనాలకు, ప్రజలకు ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ లో ఉండేలా చూడాలని, బందోబస్త్ ఏర్పాట్లు చేయాలని ఎస్పికు సూచించారు. శంకు స్థాపన జరిగే నాటికి ఆర్ అండ్ ఆర్ లో ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలని జెసి మయూర్ అశోక్‌కు సూచించారు. అందరికీ గృహాలు, అన్ని సౌకర్యాలతో ఉండేలా చూడాలని ఆర్‌డిఒ సూర్య కళ కు ఆదేశించారు. అనంతరం మీడియా పాయింట్ వద్ద మంత్రి మీడియా తో మాట్లాడుతూ జూన్‌లో సాలూరులో గిరిజన విశ్వ విద్యాలయానికి కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. సమావేశంలో జిఎంఆర్ ప్రతినిధులు, ఆర్ అండ్ బి ఎస్ఇ విజయ శ్రీ , పంచాయతీరాజ్ ఎస్ఇ గుప్తా, ఇఇలు, భోగాపురం తహశీల్దార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ

టెన్త్ మూల్యాంకనం ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక కోటలోని ఎంఆర్ హైస్కూలులో పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం బుధవారం ప్రారంభమైంది. ఉదయం పది గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా ఉపాధ్యాయుల హాజరు, పేపర్స్ తీసుకోవడం వంటివి ఆలస్యంగా జరగడం వల్ల మధ్యాహ్నం ప్రారంభమైంది. మొత్తం జిల్లాకు కేటాయించిన జవాబు పత్రాలు 181851 కాగా మొదటి రోజు 13437 జవాబు పత్రాలు మూల్యాంకనం జరిగినట్లు జిల్లా విద్యా శాఖ అధికారి బి లింగేశ్వర రెడ్డి తెలిపారు.

విజయనగరంలో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు; గజపతినగరంలో ప్రచారం చేస్తున్న సిపిఎం, సిపిఐ నాయకులు

మోడీ గద్దె దిగాలి

ప్రచారభేరీలో సిపిఎం, సిపిఐ నాయకులు

దేశ సంపద కార్పొరేట్లకు అప్పనంగా అమ్మేస్తున్న

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దేశ సంపద ను కార్పొరేట్లకు అప్పనంగా అమ్మేస్తున్న ప్రధాని మోడీ గద్దె దిగాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకర్రావు డిమాండ్ చేశారు. మోడీని గద్దె దింపడి.. దేశాన్ని కాపాడండి అంటూ సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన బుధవారం నగరంలో ప్రచారభేరి నిర్వహించారు. బొగ్గులదిబ్బ, గోశాల వద్ద ప్రచారంలో శంకర్రావు, కనపాక సిపిఎం నాయకులు పి.రమణమ్మ వినాయక నగర్ కాలనీలో బి.రమణ, తోటపాలెం బాలాజీ నగర్ లో సిపిఎం నాయకులు జగన్మోహన్ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 75 ఏళ్లుగా నిర్మించు కున్న ప్రభుత్వ రంగ సంస్థలను నేడు బిజెపి ప్రభుత్వం గత తొమ్మిదేళ్లగా పథకం ప్రకారం బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు అమ్మేస్తోందని అన్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టడం, మన భారత రాజ్యాంగాన్ని లౌకిక తత్వాన్ని విధ్వంసం చేయడం, కార్పొరేటర్ల దేశంగా మార్చడం, మోడీ చేస్తున్న దుర్మార్గాలను ప్రశ్నించే వారిపై కేసులు నమోదు చేయడం వంటి విధానాలు అవలంభిస్తోందన్నారు. మోడీ నియంతత్వ విధానాలకు వ్యతిరేకంగా , ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వెంకటేష్, హరీశ్, కృష్ణమ్మ, అప్పలకొండమ్మ తదితరులు పాల్గొన్నారు

బిజెపి విధానాలతో ప్రజలకు నష్టం

బొబ్బిలి : బిజెపి విధానాలతో ప్రజలకు తీవ్ర నష్టమని సిపిఎం మండల కార్యదర్శి ఎస్.గోపాలం అన్నారు. బిజెపి విధానాలకు వ్యతిరేకంగా రైల్వే స్టేషన్ సమీపంలో ప్రచార భేరి నిర్వహించారు. మండలంలోని సిహెచ్ బొడ్డవలసలో సిపిఎం నాయకులు పొట్నూరు శంకర్రావు, సిపిఐ నాయకులు కోట అప్పన్న, కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి విధానాలతో అన్ని వర్గాల ప్రజలకూ నష్టమన్నారు. విద్యుత్ చట్టసవరణ బిల్లుతో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి విద్యుత్ వినియోగదారులపై భారాలు వేసేందుకు మోడీ కుట్ర పన్నుతున్నారన్నారు. లేబర్ కోడ్ చట్టాలతో కార్మిక చట్టాలను ఉల్లంఘించారన్నారు. విద్యా రంగాన్ని నాశనం చేసేందుకు నూతన విద్యా విధానాన్ని తీసుకువచ్చారన్నారు. మోడీ విధానాలను వ్యతిరేకించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు, అసంఘటిత కార్మికులు పాల్గొన్నారు.

మోడీ నుండి దేశాన్ని కాపాడాలి

గజపతినగరం : మోడీ నుండి దేశాన్ని కాపాడాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.లక్ష్మి అన్నారు. మండల కేంద్రంలో ప్రచార బేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం భారత దేశ ప్రజానీకాన్ని కష్టాలు పాలు చేస్తుందన్నారు. కార్పొరేట్లకు ప్రజల సంపదను అప్పనంగా అప్పగిస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తుందనీ, ప్రజాస్వామ్యక, ఫెడరల్ రాజ్యాంగ హక్కులను కాలరాస్తుందని మండిపడ్డారు. దళిత, గిరిజన, రైతు, కార్మికుల, మహిళల, ఉద్యోగుల హక్కులపై దాడి చేస్తుందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అమ్మే కుట్ర చేస్తుందన్నారు. అసంఘటితరంగా కార్మికుల సంక్షేమాన్ని పక్కనపెట్టి సంక్షేమ బోర్డుని తుంగలో తొక్కుతుందన్నారు. మోడీని గద్దె దించేందుకు ప్రజల సిద్ధం కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆర్.ఈశ్వరరావు ఎస్.నారాయణ రావు, పి. సూర్యనారాయణ, పి.శ్రీను, పి.అప్పలనాయుడు, పాపారావు పాల్గొన్నారు.

సగటు వేతనం పెరిగేలా చర్యలు

పనుల్లో వేతనదారుల సంఖ్య పెరగాలి • పలు గ్రామాల్లో కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి-జామి

కలెక్టర్ నాగలక్ష్మి ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల అమలుపై వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు క్షేత్రస్థాయి పర్యటనలకు శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా కలెక్టర్ బుధవారం జామి మండలంలో విస్తృతంగా పర్యటించి ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలుపై ఆరా తీశారు. అలమండ, గొడుకొమ్ము, జి.సింగవరం, కుద్దుపాలెం గ్రామాల్లో పర్యటించిన కలెక్టర్ ఉపాధి పనులు జరుగుతున్న తీరును, గ్రామ సచివాలయాల ద్వారా అందుతున్న సేవలను, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజిషియన్ విధానాన్ని, గృహ నిర్మాణాన్ని, సమగ్ర భూముల రీసర్వేను పాఠశాలల్లో గోరుముద్ద, నాడు -నేడు కార్యక్రమాల అమలును, గ్రామ సచివాలయాల ద్వారా అందుతున్న సేవలను పరిశీలించారు.

తొలుత గొడుకొమ్ము గ్రామంలోని కొత్తచెరువులో జరుగుతున్న ఉపాధి పనులను తనిఖీచేసి కూలీలతోను, ఉపాధి సిబ్బందితోను మాట్లాడారు. చెరువులో పూడికతీత, గట్టు పటిష్టపరిచే పనిని రూ.10 లక్షల అంచనాతో చేపట్టినట్టు డ్వామా ఎపిడి శారదాదేవి కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ కూలీలతో మాట్లాడి వారికి సగటు వేతనం ఎంత వస్తున్నదీ, ఎన్ని గంటలు పనిలో పాల్గొంటున్నదీ, సక్రమంగా వేతనాలు చెల్లింపులు జరుగుతున్నదీ లేనిదీ తెలుసుకున్నారు. సగటు వేతనం రూ.240 వస్తోందని వేతనదారులు వివరించారు. కనీసం రూ.250కు తగ్గకుండా వేతనం వచ్చేలా చర్యలు చేపట్టాలని ఎంపిడిఒ సతీష్‌ను కలెక్టర్ ఆదేశించారు.ఇదే గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేసి మధ్యాహ్న భోజన పథకాన్ని, టాయిలెట్లను పరిశీలించారు. 4,5 తరగతుల విద్యార్థులతో ముచ్చటించారు. అలమండలో గ్రామ సచివాలయాన్ని తనిఖీచేసి ఆధార్ అప్‌డేషన్ కోసం చేపట్టిన చర్యలపై ఆరా తీశారు. అలమండలో పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో నిర్మిస్తున్న కాలనీని కలెక్టర్ పరిశీలించి ఇళ్లనిర్మాణ ప్రగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. కుద్దుపాలెంలో ఫ్యామిలీ ఫిజిషియన్ విధానాన్ని కలెక్టర్ పరిశీలించి గ్రామంలో డయాబెటిక్, బిపి రోగులకు ఎంతమందిని గుర్తించి పరీక్షలు నిర్వహించారనే విషయం వైద్యాధికారిణి కె.వి.ఎస్. పద్మావతిని అడిగి తెలుసుకున్నారు. జి.సింగవరంలో సమగ్ర భూముల రీసర్వే కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. ప్రస్తుతం సర్వే రాళ్లుపాతే కార్యక్రమాన్ని రెండు షిఫ్టుల్లో చేపడుతున్నామని తహశీల్దార్ హేమంత్ కుమార్ వివరించారు. పర్యటనలో కలెక్టర్ వెంట ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, హౌసింగ్ పీడీ ఎస్‌వి రమణమూర్తి, డిడిఒ జిఎస్.నిర్మలాదేవి, డ్వామా ఎపిడి శారదాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

మస్తరు ఎవరేస్తారు..?

ఉపాధి కూలీల ఆందోళన

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలోని ఇప్పలవలస పంచాయతీలో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులకు మస్తర్లు వేయడానికి మేట్‌ను నియమించాలని గ్రామపెద్దలు గెద్ద అన్నవరం, సర్పంచ్ గెద్ద పైడిరాజు ఆధ్వర్యంలో బుధవారం కూలీలు ఎంపిడిఒ కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం ఎంపిడిఒ పాండ్రంకి త్రివిక్రమరావుకు వినతి పత్రం ఇచ్చేందుకు కార్యాలయంలోకి వెళ్లగా మీరంతా బయటకు వెళ్లాలని ఆయన వేతనదారులతో దురుసుగా వ్యవహరించారు. దీంతో ఆగ్రహించిన కూలీలు ఎంపిడిఒను నిలదీశారు. ఈ నేపథ్యంలో వారి మధ్య వాగ్వివాదం నెలకొంది. గ్రామంలో లేని వ్యక్తి సీతంనాయుడుకు మేట్ నియామకం చేయడంపై కూలీలు మండిపడ్డారు. మేట్‌గా నియమించిన వ్యక్తి విశాఖలో ఉంటే తమ మస్తర్లు ఎవరు వేస్తారని ప్రశ్నించారు. గతంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న సీతంనాయుడును మేట్‌గా నియమించడం, తమ వర్గానికి చెందిన వ్యక్తిని తొలగించడం అమానుషమని వేతనదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ పనిచేసిన ఫీల్డ్ అసిస్టెంట్ రామునాయుడును పక్క పంచాయితీలో పనిచేయమనడం నిబంధనలకు విరుద్ధంగా ఉందని వారు వాపోయారు. ఉపాధి వేతన దారులలో ఒకరిని మేట్‌గా నియమించి మస్తర్ పడే విధంగా చూడాలని వారు వినతిపత్రం అందజేశారు. ఇప్పటి వరకు పనులు చేసినా మస్తర్ల విషయంలో ఉపాధి సిబ్బంది పట్టించుకునే దాఖలాలు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేతనదారులు ఫిర్యాదు మేరకు సంబంధిత ఎపిఒ, టెక్నికల్ అసిస్టెంట్‌కు సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పినట్లు ఎంపిడిఒ తెలిపారు.

ఎంపిడిఒను ప్రశ్నిస్తున్న గ్రామ సర్పంచ్ తదితరులు

అలీజాన్ హత్య కేసులో నిందితులు అరెస్టు

పీక కోసేసి..పెట్రోల్‌పోసి తగులబెట్టేసి..

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని గెడ్డవీధికి చెందిన రౌడీ షీటర్ షేక్ అలీజాన్ (33)ను హత్య చేసిన నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. అలీజాన్‌ను తొలుత పీక కోసేసి, తరువాత పెట్రోల్ పోసి తగులబెట్టినట్లు పోలీసులు తెలిపారు. ఆలీజాన్‌ను నగరానికి చెందిన పొంతపల్లి సురేష్, పడాల సంతోష్ కుమార్, పొంతపల్లి శివ, గేదెల సన్యాసినాయుడు కలిసి హత్య చేసినట్లు తెలిపారు. బుధవారం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈ ఘటనకు సంబంధించిన వివరాలను డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు వివరించారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం..

ఈనెల 15వ తేదీ రాత్రి దాసన్నపేట రింగురోడ్డు సమీపంలో గల బాబు రెస్టారెంట్ అండ్ బార్‌లో అలీజాన్, తన స్నేహితుడు లక్ష్మణరావుతో పాటు మరికొంతమంది మద్యం తాగేందుకు వెళ్లారు. ఈ సందర్భంగా లక్ష్మణరావుకు బార్ లో పని చేస్తున్న సర్వర్ సూరిబాబుతో మధ్య గొడవ జరిగింది. బార్ మేనేజరుగా పని చేస్తున్న గేదెల సన్యాసినాయుడు వచ్చి లక్ష్మణరావును కర్ర కొట్టడంతో అతనికి గాయాలయ్యాయి. తిరుమల మెడికోవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మణరావును పరామర్శించేందుకు గెడ్డవీధికి చెందిన షేక్ ఆలీజాన్ ఆసుపత్రికి వెళ్లాడు. అదే సమయంలో లక్ష్మణరావును గాయపర్చిన విషయాన్ని గేదెల సన్యాసినాయుడు తన స్నేహితుడైన పొంతపల్లి సురేష్ చెప్పడంతో అతనితో పాటు పొంతపల్లి సురేష్ (32), అతని తమ్ముడు పొంతపల్లి శివ (30), పడాల సంతోష్ కుమార్ (29) కలిసి ఆసుపత్రికి చేరుకున్నారు. లక్ష్మణరావును కొట్టిన విషయమై మాట్లాడేందుకుగాను షేక్ ఆలీజాన్‌ను తీసుకొని వీరు మోటారు సైకిళ్ళపై ధర్మపురి రోడ్డులో లే-అవుట్ వద్దకు వెళ్ళి, మద్యం సేవించారు. ఈ సమయంలో వారి మధ్య గొడవ పెరిగి, ఆలీజాన్ ను పొంతపల్లి సురేష్ మద్యం బాటిల్ పగులగొట్టి బాటిల్‌తో కొట్టి, అతని గొంతుపై బాటిల్‌తో కోయడంతో, ఆలీజాన్ అక్కడికక్కడే చనిపోయాడు. అనంతరం, ఆలీజాన్ మృతదేహాన్ని మాయం చెయ్యాలనే ఉద్దేశంతో మోటారు సైకిల్‌పై ఎక్కించుకొని, 16వ తేదీ రాత్రి ధర్మపురి రోడ్డు మీదుగా, ఐనాడ జంక్షన్ వెళ్ళి, అక్కడ నుండి యూ టర్న్ తీసుకొని సత్యన్నారాయణ పురం మీదుగా చిన్నాపురం లే-అవుట్ వద్ద తీసుకొని, శవంను పాతిపెట్టాలని భావించారు. అప్పటికే తెల్లవారు కావడం, పశువుల కాపరులు రావడంతో శవాన్ని దాచిపెట్టి, చిన్నాపురం వద్ద నిందితుడు సురేష్‌కుగల మామిడితోటలో బట్టలు తడిపేయడం, చేతులు కడుక్కోవడం చేసారు. హత్య జరిగిన ధర్మపురి లే-అవుట్‌కు వెళ్ళి, అక్కడ హత్య జరిగిన ప్రాంతంలో ఆనవాళ్ళు లేకుండా మట్టి, కారం జల్లారు. సురేష్ వద్దపని చేసే ప్రసాద్ (తాపీ మేస్త్రి) సంబంధించిన కారులో గేదెల సన్యాసినాయుడు ను తీసుకొని, మళ్ళీ శవాన్ని మాయం చేయాలని చిన్నాపురం వెళ్లారు. శవాన్ని కారులో ఎక్కించుకొని, దారిలో రోడ్డు పక్కన షాపులో పెట్రోలు బాటిళ్ళు కొనుగోలు చేసి, చిన్నాపురం నుండి పద్మనాభం గ్రామం వైపు వెళ్లారు. అక్కడ పోలీసులు వాహన తనిఖీలు చేపట్టడంతో, రేగిడి వైపు కారును మళ్ళించి, కోరాడ, లింగన్నపేట మధ్య నిర్మానుష్య ప్రదేశానికి తీసుకొని వెళ్ళి, అక్కడ తోటలో పెట్రోలు పోసి, శవంను కాల్చే ప్రయత్నం చేసారు. అప్పటికే 15 తేదీ నుంచి భర్త కనిపించక పోవడంతో ఆలీ జాన్‌భార్య పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.ఆస్పత్రిలో సిసి కెమెరాలను పరిశీలించారు. పైన తెలిపిన నిందితులు ఆలీజాన్‌ను సురేష్, శివ, సంతోష్ లు తీసుకెళ్లినట్లు ఉంది. ఈ ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారించగా తమతో పాటు సన్యాసినాయుడు కలిసి హత్య చేసినట్లు తెలిపారు. విలేకర్ల సమావేశంలో 2వ పట్టణ సిఐ సిహెచ్.లక్ష్మణరావు, ఎస్ఐ షేక్ శంకర్ పాల్గొన్నారు.

విలేకర్ల సమావేశంలో నిందితులను చూపుతున్న డిఎస్‌పి, సిఐ, ఎస్ఐ

యువతే నా బలం : కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తన బలం యువతే అని.. వీరంతా అండగా ఉండబట్టే మునుపెన్నడూ లేనివిధంగా విజయనగరంలో ఇంత అభివృద్ధి సాధించామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. ఏ రాజకీయ వారసత్వమూ తనకు లేదని, సామాన్య కార్యకర్తగానే జీవితం ప్రారంభించానని, ఈ 40 ఏళ్లలో కార్యకర్తలు, యువతే తనకు అండగా నిలిచారని చెప్పారు. బుధవారం తన నివాసం వద్ద మండలంలోని కొండకరకాం, గుంకలాం గ్రామాలకు చెందిన యువతతో సమావేశం నిర్వహించారు. నేడు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం విజయవంతంగా సాగుతుందంటే.. యువత ఇచ్చిన ఉత్సాహమే అని కోలగట్ల తెలిపారు. లంచగొండితనం లేని పాలన మనదన్నారు. కోలగట్ల వీరభద్ర స్వామి ఏ పనికైనా డబ్బులు తీసుకున్నారా? అని ప్రశ్నించారు. ప్రజా సంక్షేమం కోరుకునే ఇటువంటి ముఖ్యమంత్రికి మనమంతా మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో యువజన, విద్యార్థి విభాగాలను పటిష్టం చేయాలని.. ఇందుకు సంబంధించి గ్రామాలు, జోనల్ వారీగా కమిటీలు వేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో యువజన విభాగం జిల్లా అధ్యక్షులు సంగంరెడ్డి బంగారు నాయుడు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు అల్లు చాణిక్య, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి జివి రంగారావు, మండల జోనల్ ఇన్చార్జి కెల్ల త్రినాథ్, సర్పంచులు కిలారి రాంబాబు, కునుకు నాగరాజు, ఎంపిటిసి భోగాపురపు ఆదినారాయణ, వైస్ ఎంపిపి నారాయణ, అధిక సంఖ్యలో యువత పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కోలగట్ల వీరభద్రస్వామి

రూ.63.25 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభం

నగరపాలక సంస్థ పరిధిలోని 40, 36వ డివిజన్లలో సుమారు 63.25 లక్షల వ్యయంతో నిర్మించిన సిసి రహదారులు, డ్రైన్లు తదితర అభివృద్ధి పనులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతీ దేవి తదితరులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా కార్పొరేటర్లు బోనెల ధనలక్ష్మి, బాలి పద్మావతి తదితరులు మాట్లాడుతూ.. తమ ప్రాంతంలో ఒక సమస్య ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన మరుక్షణమే వాటికి పరిష్కారం లభిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో జోనల్ ఇన్చార్జులు బొద్దాన అప్పారావు, బాల బ్రహ్మారెడ్డి, కుమ్మరిగుంట శ్రీనివాస రావు, నాయకులు ఎస్. బాబు, మొయిద ఆదిబాబు, బాలి కృష్ణారావు, తాళ్లపూడి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-రేగిడి
ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైసిపికే దక్కుతుందని ఆ పార్టీ కన్వీనర్ వావిలపల్లి జగన్మోహన్ రావు అన్నారు. బుధవారం బూరాడ గ్రామంలో సర్పంచ్ వావిలపల్లి శశిభూషణరావు ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లు అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. అర్హులై ఉండి ఇంతవరకు సంక్షేమ పథకాలు అందనివారు వాలంటీర్ల సహకారంతో సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

డెంకాడ: మండలంలోని పేడాడ, కొండ్రాజు పాలెం గ్రామాల్లో బుధవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు రాము, బంగారురెడ్డి, జెసిఎస్ కన్వీనర్ గౌరు, వినోద్, ప్రకాశ్, ఉప సర్పంచులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న లేగ దూడల ప్రదర్శన

బాడంగి : స్థానిక వెటర్నరీ హాస్పటల్‌లో పశువైద్య అధికారి గోవింద్ ఆధ్వర్యంలో పాడి రైతులు కృత్రిమ గర్భ ధారణ ద్వారా జన్మించిన ఆడ దూడల ప్రదర్శన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వైవీ రమణ పాల్గొని మాట్లాడారు. కృత్రిమ గర్భధారణ ద్వారా ఎక్కువ శాతం ఆడ దూడలు పుట్టడం చాలా సంతోషకరమైన విషయమన్నారు. జిల్లాలో ఎక్కువ శాతం కృత్రిమ గర్భ ధారణ ద్వారా రైతులు ఆవులకు ఇంజక్షన్‌లు చేయించుకుంటున్నారన్నారు. దీని ద్వారా రైతులకు అధిక లాభాలు పొందవచ్చు అని అన్నారు. అనంతరం మొదటి మూడు ఆడ దూడలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి డివిజన్ పశుసంవర్ధక శాఖ డి.డి, డాక్టర్ నీలయ్య, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డి.డి డాక్టర్ దామోదర రావు, విజయనగరం డివిజన్ డి.డి డాక్టర్ రామచంద్రారావు, జెడ్‌పిటిసి పెద్దింటి రామారావు, తెర్లాం ఎడి నాగరాజు, సర్పంచ్ కండి రమేష్, డాక్టర్ రాధిక, పశుసంవర్ధక శాఖ సహాయకులు, సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

భూ కబ్జాలపై చర్యలు తీసుకోవాలి

బొబ్బిలి : పట్టణ, మండల పరిధిలో జరుగుతున్న భూకబ్జాలపై రెవెన్యూ యంత్రాంగం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ తహశీల్దార్ నమ్మి రాజారావుకు సిపిఐ నాయకులు బుధవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న మాట్లాడుతూ బొబ్బిలి పట్టణంలో ప్రభుత్వ స్థలాలను చెరువులను కబ్జా చేస్తున్నారని పలుమార్లు రెవెన్యూ యంత్రాంగానికి విన్నవించుకున్న ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి ఎం శ్రీనివాస్. వై బాబ్జి, ఆర్ నాగమ్మ, డిహెచ్పిఎస్ నాయకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్షలు

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఈనెల 23న 10 గంటల నుంచి 5వ తరగతి ప్రవేశ పరీక్షలు కాగా, మధ్యాహ్నం 2 గంటలకు ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బుచ్చిరాజు తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పరీక్ష ప్రారంభానికి గంట ముందు ఉండాలన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టిక్కెట్టు, ఆధార్, ఫోటోలు విదిగా తీసుకురావాలన్నారు..

ప్రమాద బాధితుడికి ఉద్యోగుల ఆర్థిక సాయం

నెల్లిమర్ల : కొండవెలగాడలో ప్రమాద బాధితుడికి ఉద్యోగులు ఆర్థిక వితరణ అందజేశారు. మంగళవారం రాత్రి గ్రామంలోని ఉద్యోగులు దళిత యువకునికి నగదు వితరణ చేసారు. ఇటీవల గ్రామానికి చెందిన దళిత యువకుడు వంకర అప్పారావు గ్రామంలో స్థంభం ఎక్కి దిగుతుండగా ప్రమాదవశాత్తు జారి పడిపోవడంతో గాయాలపాలయ్యాడు. దీంతో అతడు కూలి పనులు చేసుకోలేక ఇంటికే పరిమితమయ్యాడు. బాధితుడిది నిరుపేద కుటుంబం కావడం, ఇటీవల కాలంలోనే అతని తండ్రి చనిపోవడంతో ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతుంది. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన కొంతమంది ఉద్యోగులు స్పందించి అప్పారావు కుటుంబానికి రూ.20 వేలు నగదు, 3వేల రూపాయలు విలువ చేసే నిత్యావసర సరుకులు అందజేశారు. అప్పారావు కుటుంబానికి ఉద్యోగులు చేసే సాయం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ వారిని అభినందించారు. మరిన్ని సేవా కార్యక్రమాలు గ్రామంలో చేపట్టాలని వారు కోరారు.

ఫైర్ సిబ్బంది మాక్ డ్రిల్

కొత్తవలస : మండలంలోని కంటకాపల్లి పంచాయతీలో కార్యాలయం వద్ద ఫైర్ సిబ్బంది, శారదా మెటల్స్ ఫైల్స్ సిబ్బంది, సంయుక్తంగా ఫైర్ మాక్ డ్రిల్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ ప్రదర్శన ద్వారా ప్రజలు అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఏ విధంగా జాగ్రత్త తీసుకోవాలో క్షుణ్ణంగా వివరించారు. సిబ్బందితో మాక్ డ్రిల్ చేయించారు. స్థానిక ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల వద్ద ఫైర్ సిబ్బంది మాక్ డ్రిల్ చేయించారు. కొత్తవలస ఫైర్ ఆఫీసర్ వై. అశోక్ కుమార్ దగ్గరుండి పంచాయతీ కార్యదర్శి సిబ్బందితో ఫైర్ విన్యాసాలు చేయించారు. ఈ కార్యక్రమంలో శారద మెటల్స్ టీం విన్యాసాలు చేశారు. పంచాయతీ కార్యదర్శి మాధవీ లత, మదిన అప్పలరాం, విఆర్ఒ మల్లేశ్వరరావు, శారదా మెటల్స్ ఫైర్ అండ్ సెక్యూరిటీ మేనేజర్ హెచ్. పద్మాకర్ రావు, హెచ్ఆర్ అసిస్టెంట్ మేనేజర్ జి. శంకర్రావు, హెచ్ఆర్ ఆఫీసర్ సంతోష్ కుమార్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటిస్తే గరిష్ట వేతనం

మెరక ముడిదాం : ఉపాధి వేతన ధారులు అందరూ సమయపాలన పాటిస్తే రోజు వారి గరిష్ట వేతనం రూ. 272 పొందవచ్చునని ఎపిఒ ఎస్. పెదప్పలనాయుడు తెలిపారు. బుధవారం ఆయన సోమలింగాపురం పంచాయతీ పరిధిలో వున్న పిట్టవాని చెరువులో సుమారు రూ.9.80లక్షలతో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. వేతనదారుల మస్టర్లని పరిశీలించారు. అనంతరం వేతన దారులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ప్రభుత్వం సూచించిన కొలతలు ప్రకారం పనిచేయాలన్నారు. పని ప్రదేశంలో టెంట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉన్నాయని, వేసవి తాపం ఎక్కువగా ఉన్నందున పని ప్రదేశంలో తాగు నీరు కూడా ఉంచటం జరుగుతుందని చెప్పారు.

నైతిక అంశాలపై సెమినార్

విజయనగరం : స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో 'నూతన వ్యాపారానికి కావలసిన చట్టపరమైన, నైతిక అంశాల'పై బుధవారం సెమినార్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కేంద్రీయ గిరిజనవిశ్వవిద్యాలయం, బిజినెస్ మేనేజమెంట్ విభాగానికి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్.వి.అప్పసబ విచ్చేశారు. కొత్త వ్యాపారాలకు భారతదేశంలో ఎదురయ్యే సవాళ్లను వాటి పరిష్కారాల గురించి వివరించారు. ముద్ర యోజన ద్వారా కొత్త వ్యాపారాలను ప్రారంభించవచ్చని, కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహకారం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్. మజ్జి.శశిభూషణరావు మాట్లాడుతూ విద్యార్థులకు సమాజంపై నూతన వ్యాపారం ఏ విధంగా ప్రభావాన్ని చూపిస్తుందో వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి.రామమూర్తి విద్యార్థులను నూతన వ్యాపార ఆలోచనలతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిపార్ట్మెంట్ ఆఫ్ మేనేజ్మెంట్ స్టడీస్ హెచ్ఒడి డాక్టర్ ఎస్.వరూధిని,అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుక్కల పట్టివేతపై విచారణకు ఆదేశం

విజయనగరం టౌన్ : విజయనగరం మున్సిపల్ పరిధిలో జరిగిన కుక్కల స్కామ్ పై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని రీజనల్ డైరెక్టర్ జి.నాగరాజు విజయనగరం కార్పొరేషన్ కమిషనర్‌ను ఆదేశించారని గో సంరక్షణ సమైఖ్య రాష్ట్ర అధ్యక్షులు లోగిశ రామకృష్ణ తెలిపారు. బుధవారం గో సంరక్షణ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చట్ట విరుద్ధంగా కుక్కలను కొట్టి, తాళ్లతో బంధించి అపరేషన్ల పేరిట హింసించడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఈ ఘటనలో కమిషనర్ శ్రీరాముల నాయుడు, హెల్త్ ఆఫీసర్ కె.సత్యనారాయణపై చర్యలు తీసుకోవాలని ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ముకుందపురంలో గ్రామ సభ

వేపాడ : మండలంలోని ముకుందపురంలో బుధవారం గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో గ్రామానికి చెందిన అభివృద్ధి పనులు గుర్తించి పనులు చేపట్టడానికి అవసరమైన తీర్మానాలను గ్రామపంచాయతీ సభ్యులు ఆమోదించారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి సిహెచ్ సూర్యనారాయణ, మండల పంచాయతీ ఇంజనీరింగ్ అధికారి ఆలీ, గ్రామ సర్పంచ్ కనకరాజు, పాటూరు గ్రామ సర్పంచ్ వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ రమణమూర్తి, పంచాయతీ కార్యదర్శి సంధ్య, సచివాలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పవర్ కట్ కట..

- విద్యుత్తు కోతలతో అల్లాడిపోతున్న ప్రజలు
- రాత్రీ, పగలు తేడా లేకుండా సరఫరా నిలిపివేత
- పరీక్షల వేళ ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి - విజయనగరం టౌన్
జిల్లాలో విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అవసరాన్ని బట్టి డిస్కమ్‌లు గ్రామీణ ప్రాంతాల్లో పగటిపూట గంటల తరబడి కరెంటు కోత విధిస్తున్నారు. మరోవైపు మున్సిపల్ ప్రాంతాల్లో రెండు గంటలకు పైగా అప్రకటిత విద్యుత్తు కోతలు ప్రారంభమయ్యాయి. మంగళవారం రాత్రి నగరంలో కొన్ని ప్రాంతాల్లో 10 గంటల నుంచి 12 గంటలు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు తీసేసిన కరెంట్ నాలుగు గంటలు వరకు ఇవ్వలేదు. ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్ పేరుతో కరెంట్ కోతలు విధిస్తున్నారు. అయితే ఈ పవర్ కట్స్‌పై ముందస్తు సమాచారం లేకుండా అమలు చేయడంపై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాలు, పట్టణాల అన్న తేడా లేకుండా ఎడాపెడా విద్యుత్ కోతలు విధిస్తున్నారు. రాత్రి, పగలు తేగా లేకుండా విద్యుత్ కోతలు విధిస్తుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఓవైపు ఎండ తీవ్రత, మరోవైపు విద్యుత్ కోతలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండు వేసవిలో సమయం సందర్భం లేకుండా గంటల తరబడి విద్యుత్ కోతలు ఏమిటని ప్రశ్నిస్తున్నారు. రాత్రివేళ గంటల తరబడి కరెంటు సరఫరా నిలిపివేయడంతో చేయడంతో నరకయాతన అనుభవిస్తున్నామని చెబుతున్నారు.

ముందస్తు సమాచారం లేకుండానే..

గ్రామీణ ప్రాంతాలలో షెడ్యూల్ లేని విద్యుత్ కోతల కారణంగా జనాలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. నగరాల్లో కూడా ముందస్తు సమాచారం లేకుండా విద్యుత్ కోతలు విధించడంతో జనం తీవ్ర

కొవ్వొత్తుల వెలుతురులో చదువుతున్న విద్యార్థినులు

ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిళ్లు కూడా కరెంట్ కోతలతో పసిపిల్లల తల్లులు విసనకర్రలతో గాలి విసురుతూ కూర్చోవాల్సి వస్తోంది. విద్యార్థులు, పరీక్షలకు సన్నద్ధమవుతున్న వారు కూడా కరెంట్ కోతలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పగలంతా తరగతి గదుల్లో ఉండి రాత్రిళ్ల ప్రశాంత నిద్ర లేక ఒత్తిడికి గురవుతున్నారు. కరెంట్ కోతలతో చిరువ్యాపారులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల విద్యుత్ కోతలను వ్యతిరేకిస్తూ రైతులు, ప్రజలు విద్యుత్ సబ్ స్టేషన్‌లకు విద్యుత్ కోతలపై ఫిర్యాదులు కూడా చేస్తున్నారు. కాల్ చేసి ఫిర్యాదు చేస్తున్న మరి కొంత మంది విద్యుత్ కోతలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొందరైతే కోతలు విధించే షెడ్యూల్ ప్రకటించాలని అడుగుతున్నారు.

కోతలు ఎందుకంటే..?

సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ వర్గాల సమాచారం ప్రకారం.. అధిక పగటి ఉష్ణోగ్రతల కారణంగా విద్యుత్ వినియోగం పెరిగింది. ఏసీలను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. రైతుల కూడా పంటలను కాపాడుకునే ప్రయత్నంలో మోటార్ పంపుసెట్లను ఉపయోగిస్తున్నారు. మరోవైపు షాపింగ్ మాల్స్, కోల్డ్ స్టోరేజీ యూనిట్లు, ఆసుపత్రులు కూడా ఎక్కువ విద్యుత్ వినియోగిస్తున్నాయి. దీంతో రాష్ట్రంలో విద్యుత్ వినియోగం క్రమంగా పెరుగుతోంది కాబట్టి విద్యుత్ కోతలు తప్పవనే సమాచారం తెలుస్తుంది. విద్యుత్ కోతలు ఉంటాయా లేదా అనేది అధికారులను ప్రశ్నిస్తే సమాధానం రావడం లేదు.

పార్టీ మీటింగా..? సర్వసభ్య సమావేశమా..?

ప్రజాశక్తి - లక్కవరపుకోట
మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ జ్ఞానేశ్వరరావు ఆధ్వర్యంలో ఎంపిపి గేదెల శ్రీనివాసరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం వైసిపి పార్టీ మీటింగ్‌లా సాగింది. ఎంపిడిఒ ప్రత్యేక చొరవతో సభ్యులు కాని వారిని కొంతమంది వైసిపి నాయకులను సర్వసభ్య సమావేశానికి ఆహ్వానించారు. ఎన్నడూ లేని విధంగా పార్టీ నాయకులను ఎంపిడిఒ ఆహ్వానించడంపై పలువురు విమర్శిస్తున్నారు. తొలుత గ్రామాలలో చేపడుతున్న అభివృద్ధి పనులను తమకు తెలియకుండా చేపిస్తున్నారని సంతపేట ఎంపిటిసి కె.సత్యవతి భర్త జగ్గన్నదొర, రెల్లిగైరంపేట సర్పంచ్ పినిశెట్టి లక్ష్మి మరిది కృష్ణప్పదొర, మార్లాపల్లి ఎంపిటిసి లెక్కల గౌరీ భర్త వీరబాబు, గనివాడ ఎంపిటిసి గేదెల లక్ష్మి భర్త శాంత తదితరులు ఎమ్మెల్సీ ఇందుకూరు రఘురాజును నిలదీశారు. సభ్యులు కాని వారిని సమావేశ మందిరంలోకి ఎంపిడిఒ ఆహ్వానించడం వల్లనే కొంతమేర ఘర్షణ వాతావరణం నెలకొంది. ఎమ్మెల్సీ

సభ్యులు కాని వారిదే హవా.!

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ఇందుకూరి రఘురాజు, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సర్ది చెప్పడంతో వైసిపి నాయకులు శాంతించారు. అనంతరం వివిధ శాఖల అధికారులను ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. ఎల్ కోట సచివాలయం కార్యదర్శి ఏ పనికైనా లంచం గుంజుతున్నాడని కో ఆప్షన్ నెంబర్ షేక్ ఖాసిం, లచ్చింపేట ఎంపిటిసి భూమిరెడ్డి స్వామినాయుడు ఆరోపించారు. రేగ పంచాయతీలో రైతులు పండించిన 30 టన్నుల ధాన్యం ఇంకా కొనుగోలు చేయాల్సి ఉందని ఎంపిటిసి గణపతి తెలిపారు. గోల్డ్ స్టార్, మహామాయ పరిశ్రమల ద్వారా వెదజలుతున్న బూడిద రేణువులు పంట పొలాలనే కాకుండా గ్రామాలను కాలుష్యంతో కమ్మేస్తున్నాయని తామరాపల్లి సర్పంచ్ భాస్కరరావు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ, ఐసిడిఎస్, ఇరిగేషన్ వంటి శాఖలపై సభ్యులు తీవ్రంగా మండిపడ్డారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసిపి బలోపేతానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పని చేయాలన్నారు. సెగ్మెంట్ పరిధిలవారీగా అందరితో సమావేశమై తగు సూచనలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తహశీల్దార్ తామరాపల్లి రామకృష్ణ, జెడ్‌పిటిసి తూర్పాటి వరలక్ష్మి, వైస్ ఎంపిపి ఆవాల శ్యామల, గొల్జాం గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ తూర్పాటి శివాజీ, మండల జెసిఎస్ కన్వీనర్ యడ్ల కిషోర్ కుమార్, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపటిసిలు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం

బొబ్బిలి : ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చునని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించేందుకు పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు పొందవచ్చునన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చునన్నారు. తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో ఎంటి రమేష్, ఎస్‌డిఎ వి.లక్ష్మి, పాల్గొన్నారు.

నేడు చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి- శృంగవరపుకోట
మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పుట్టిన రోజు వేడుకలలో అధికసంఖ్యలో పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని టిడిపి నియోజకవర్గ నాయకుడు గొంప కృష్ణ, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి వేరువేరుగా విలేకరుల సమావేశాలలో తెలిపారు. ఈ సందర్భంగా గొంప కృష్ణ బుధవారం మామిడిపల్లి గ్రామంలో మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో చంద్రన్న పుట్టినరోజు వేడుకలను ఘనంగా చేస్తున్నామని తెలిపారు. మండలంలోని వెంకటరమణపేటలో గురువారం ఉదయం స్థానిక సాయిబాబా మందిరంలో పూజలు చేసి కేకును కత్తిరించి వేయి ద్విచక్రవాహనాలతో భారీ ర్యాలీ వుంటుందన్నారు. ఆర్కె ఫంక్షన్ హాల్‌లో రక్తదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామని యువత పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో గోపాలపల్లి సర్పంచ్ ఆడారి మహేశ్వరరావు, టిడిపి విశాఖ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు రాయవరపు చంద్రశేఖర్, మండల పార్టీ కార్యదర్శి జుత్తాడ రామసత్యం, పార్టీ నాయకులు ఎం.మంగరాజు, ధర్మవరం సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలోని ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద కోళ్ల లలిత కుమారి మాట్లాడుతూ గురువారం చంద్రబాబు అభిమానుల ఆధ్వర్యంలో స్థానిక దేవిగుడిలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. ఎన్‌టిఆర్ విగ్రహానికి పాలాభిషేకం, పూలమాలలతో నివాళులు అర్పిస్తామన్నారు. 73వ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేస్తామన్నారు. స్థానిక పిహెచ్‌సిలో రోగులకు పాలు, రొట్టెలు పంపిణీ చేస్తామన్నారు. మధ్యాహ్నం ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద పేద ప్రజలకు అన్నదాన కార్యక్రమం చేపడతామన్నారు. టిడిపి అభిమానులు పెద్ద ఎత్తున హాజరై, ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆమె కోరారు.

నేడు టిడిపి బైక్ ర్యాలీ

వేపాడ : మాజీ సిఎం చంద్రబాబు పుట్టిన రోజును పురస్కరించుకుని గురువారం మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తామని టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత మండల కేంద్రంలోని ఎన్‌టిఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి పాలాభిషేకం చేస్తామన్నారు. అనంతరం చలివేంద్రం ఏర్పాటు చేసి, వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తామన్నారు. బైక్ ర్యాలీ వేపాడ నుంచి ఎస్‌కోట వరకూ చేపడతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

వడదెబ్బపై ప్రజలు అప్రమత్తం

ప్రజాశక్తి - కొత్తవలస
వేసవి కాలంలో ఎండలు తీవ్రంగా ఉండటం వల్ల డీహైడ్రేషన్‌కి గురి కాకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వియ్యం పేట పిహెచ్‌సి వైద్యాధికారి ఈ. గోపాలకృష్ణ తెలిపారు. మండలంలో మసీవానిపాలెం, చీడివలస ఉపాధి హామీ వేతన దారులుకి బుధవారం అవగాహన కల్పించి, ఒఆర్ఎస్ పాకెట్స్ పంపిణీ చేశారు. వడదెబ్బకి గురైతే జ్వరం, వాంతులు అవడం, చర్మం పొడిబారడం, కాళ్ళు, చేతులు పీకులు వంటి లక్షణాలు ఉంటాయని తెలిపారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4గంటలు వరకు ఎండలో తిరగరాదని తెలిపారు. బైటకి వెళ్లేటప్పుడు తలకి టోపీ, కాళ్ళకి చెప్పులు, గొడుగు వేసుకొని వెళ్లాలని సూచించారు. మజ్జిగ, బార్లీ, గ్లూకోజ్, నిమ్మరసం బాటిల్‌తో తీసుకెళ్లాలని తెలిపారు. లేతవర్ణం తెల్లటి కాటన్ దుస్తులు ధరించాలని తెలిపారు. బిపి, షుగర్ రోగులు డైలీ మందులు వేసుకోవాలని, చిన్నపిల్లలు, గర్భిణీలు, వృద్ధులు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. వేసవిలో ధూమపానం, మద్యపానం చేయరాదని, ఖైనీ, గుట్కాలు సేవించిరాదని తెలిపారు. అన్నీ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్స్‌లోను, ఆశ వర్కర్స్ దగ్గర ఒఆర్ఎస్ ప్యాకెట్స్ అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఎఎన్ఎమ్స్, ఆశ వర్కర్స్‌ని ప్రతీ రోజు జ్వరాలుపై సర్వే చేసి రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ ఇఒ తిరుపతి రావు, హెచ్ఎస్ రాము, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, నాగ జ్యోతి, ఏఎన్ఎమ్స్ విజయలక్ష్మి, వరలక్ష్మి, ఆశ వర్కర్స్ రేవతి, అప్పన్నమ్మలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు సూచనలు చేస్తున్న వైద్యాధికారి గోపాలకృష్ణ

అవయవాల గుర్తింపు శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి- డెంకాడ
మండల కేంద్రంలోని ఏర్పాటు చేసిన వికలాంగుల అవయవాల గుర్తింపు కేంద్రాన్ని జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం సహాయంతో గుర్తింపు శిబిరం నిర్వహించి ఉచిత ఉపకరణాలు మూడు చక్రాల సైకిల్, వీల్ ఛైర్, చెవిటి మిషన్, బ్యాటరీ ఆపరేటింగ్ మూడు చక్రాల బండి వంటి పరికరాలను వికలాంగులకు పంపిణీ చేస్తారన్నారు. లోపాలు ఉన్న వికలాంగులకు ఈ విషయాన్ని తెలియపరచి ఈ అవకాశాన్ని వినియోగించుకునేలా సచివాలయ సిబ్బంది పనిచేయాలన్నారు. ఈ సహాయ ఉపకరణాలు రెండు నెలల వ్యవధిలో ఉచితంగా అందిస్తారన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని సచివాలయ పంచాయతీ సెక్రటరీలు వెల్ఫేర్ అసిస్టెంట్లు, వాలంటీర్లు వికలాంగులను గుర్తించి ఈ గుర్తింపు శిబిరాలకు వచ్చేటట్లు చేసి వారు ఉచితంగా సహాయ ఉపకరణాలు పొందడానికి సహకరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో


మాట్లాడుతున్న జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

డెంకాడ, నెల్లిమర్ల ఎంపిపిలు బంటుపల్లి వాసుదేవరావు, అంబళ్ల సుధారాణి, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మినాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు రొంగలి కనక సింహాచలం, నెల్లిమర్ల నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, భోగాపురం నాయకులు పడాల భానుప్రకాశ్, పూసపాటి రేగ మండల పార్టీ అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, రాష్ట్ర డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు..

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్యం

ప్రజాశక్తి - నెల్లిమర్ల
గ్రామాల్లో ఫ్యామిలీ ఫిజిషియన్ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.వి.రమణ కుమారి సూచించారు. బుధవారం ఆమె కొండవెలగాడ పిహెచ్‌సి పరిధిలోని పారసాంలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని సందర్శించారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక్కరూ కూడా వైద్యానికి ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా మందులు, తదితర సేవలు అందించాలని సూచించారు. అనంతరం కొండ గుంపాం హెల్త్ వెల్ నెస్ సెంటర్ తనిఖీ చేసి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఎన్‌సిడి, సిడి సర్వే, వాక్సినేషన్ వివరాలపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కొండవెలగాడ వైద్యాధికారి డాక్టర్ ప్రశాంత్ రాజు, సీసీ స్వామి, కొండవెలగాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సూపర్‌వైజర్, సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలతో మాట్లాడుతున్న డిఎంఅండ్‌హెచ్‌ఒ రమణకుమారి

22న ఉచిత కేన్సర్ నిర్ధారణ పరీక్షలు

బొబ్బిలి : ఈనెల 22వ తేదీన బొబ్బిలి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విశాఖపట్నం మహాత్మాగాంధీ కేన్సర్ హాస్పిటల్ సహకారంతో ఉచిత కేన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు బొబ్బిలి రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు తెలిపారు. బుధవారం స్థానిక లక్ష్మీ మెడికల్ ఏజెన్సీ కార్యాలయంలో అందుకు సంబంధించిన కరపత్రాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ఫ్లోర్ లీడర్, 6వ వార్డు కౌన్సెల్లర్, బొబ్బిలి రోటరీ క్లబ్ సర్వీస్ ప్రాజెక్ట్ చైర్ గెంబలి శ్రీనివాసరావు జన్మదిన సందర్భాన్ని పురస్కరించుకొని ఈ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ వైద్య శిబిరాన్ని శనివారం ఉదయం 9.30 గంటల నుండి 2 గంటల వరకు బస్ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న ఐఒసి పెట్రోల్ బంక్ వద్ద నిర్వహిస్తున్నామని అన్నారు. బొబ్బిలి పట్టణ, పరిసర ప్రాంతాలు ప్రజలు ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ముఖ్యంగా 25 సంవత్సరాలు పైబడిన మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కేన్సర్ పై వుండే అపోహలను తొలగించేందుకు నిపుణులైన వైద్యులు సూచనలు, సలహాలు ఇస్తారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఫ్లోర్ లీడర్ శ్రీనివాసరావు, రోటరీ సెక్రటరీ శ్రీహరి, మహాత్మా గాంధీ హాస్పిటల్ పిఆర్ఒ సుమన్ పాల్గొన్నారు.

కరపత్రాలను విడుదల చేస్తున్న రోటరీక్లబ్ అధ్యక్షులు

పలు ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి- నెల్లిమర్ల
నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో బుధవారం గ్రామానికి చెందిన సాధన యువజన సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభమైంది. ఈ సంధర్భంగా యువజన సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ వేసవి కాలంలో పాదచారులు, వాహనదారుల దాహార్తిని తీర్చడానికి చలి వేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీనిలో భాగంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సాధన యువజన సంఘం అధ్యక్షుడు పోలుబోతు దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శి పసుమర్తి వెంకటరమణ, సభ్యులు తుమ్ము అశోక్, పల్ల శ్రీహరి, చాపా హరి, పడాల హరికృష్ణ, నామాల శ్రీను, అవనాపు అప్పలరాజు, కనకల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

జరజాపుపేటలో చలివేంద్రం వద్ద నిర్వాహకులు

విజయనగరం కోట : ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక మయూరి హోటల్ దగ్గర మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ త్రినాధరావు చలివేంద్రాన్ని ప్రారంభిస్తూ ప్రతి ఒక్కరూ ఈ వేసవికాలంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం ఎంతైనా అవసరమని అన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున తమ వంతుగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని ప్రతి ఒక్కరూ వేసవిలో తలకు టోపీ, నల్లని అద్దాలు ధరించి ప్రయాణం చేస్తూ తరచుగా ఎక్కువగా మంచినీళ్లు తాగాలని ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షులు గెద్ద చిరంజీవి అన్నారు కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మక్కువ రమణ జోనల్ సలహాదారులు మమ్ములను తిరుపతి కోశాధికారి ఉమాశంకర్ దివాకర్ యూనీస్ భవాని గుప్తా తదితరులు పాల్గొన్నారు.

వైసిపి, టిడిపి గ్రూపుల మధ్య ఘర్షణ

పది మందికి గాయాలు.. ఆస్పత్రికి తరలింపు

వంగర: మండలంలోని మద్దువలసలో వైసిపి టిడిపి వర్గీయుల మధ్య బుధవారం ఘర్షణ జరగడంతో పది మందికి గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి వంగర పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బూరాడ గరికి నాయుడు, మన్నెన సన్యాసప్పుడు మధ్య ఓ స్థల వివాదంలో బుధవారం ఘర్షణ పడి సద్దుమణిగారు. మరలా కొద్దిసేపటి తర్వాత ఇరు వర్గాల మధ్య కొట్లాట జరగడంతో వైసిపికి చెందిన ముగ్గురుకు, టిడిపికి చెందిన ఏడుగురుకు గాయాలయ్యాయి. టిడిపికి చెందిన వారంతా రాజాంలో గల ప్రభుత్వ ఆసుపత్రిలో చేరగా వైసిపికి చెందిన వారు రాజాంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. ఈ విషయం తెలుసుకున్న వంగర ఎస్ఐ బుడుమూరు లోకేశ్వర రావు క్షతగాత్రుల వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

గామపడిన వైసిపి, టిడిపి వర్గీయులు

గంజాయి స్వాధీనం

శృంగవరపుకోట: మండలంలోని బొడ్డవర చెక్ పోస్ట్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా బుధవారం 50 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. అరకు నుంచి విశాఖపట్నం వైపు వెళుతున్న ఒక కారులో వాహన తనిఖీలు చేస్తుండగా ఈ గంజాయి పట్టుబడిందన్నారు. సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పూర్తి వివరాలను గురువారం వెల్లడిస్తామని ఎస్ఐ తెలిపారు.

దొరికిన సెల్ ఫోన్ బాధితుడికి అందజేత

ప్రజాశక్తి-విజయనగరం టౌన్
విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బుధవారం ఒడిశాకు చెందిన బాస్‌దేవ్ కాంప్లెక్స్ లో ఐఫోన్ సెల్ ఫోన్ మర్చిపోయి బస్సు ఎక్కి వెళ్లిపోయారు, డ్యూటీలో ఉండే ఆర్టీసీ పోలీస్ కుర్చీలో ఉన్న ఫోన్ గమనించి ఎవరిదని విచారణ చేశారు. కొంత సమయం తర్వాత ఆ ఫోన్‌కు బాధితుడు ఫోన్ చేసి మరచిపోయానని తెలపడంతో ఆర్టీసీ కంట్రోల్ రామరాజు బాధితుడికి వివరాలన్నీ కనుక్కొని ట్రాఫిక్ కంట్రోలర్ ఆదినారాయణ, ఎస్‌టిఐ దుర్యోధన చేతుల మీదగా బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో కంట్రోల్ రామరాజు ఆర్టీసీ పోలీస్ సత్యనారాయణ పాల్గొన్నారు.